అందని బిల్లులు.. నిలిచిన నిర్మాణ పనులు

- వెక్కిరిస్తున్న పంచాయతీ భవనాలు
- బిల్లులు చెల్లించకపోవడంతో చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు
- షెడ్లు, స్కూళ్ల భవనాల్లోనే నెట్టుకొస్తున్న కార్యకలాపాలు


కన్నారంలో అసంపూర్తిగా ఉన్న గ్రామపంచాయతీ భవన నిర్మాణం

వేలేరు : మండలంలో నూతనంగా ఏర్పడిన గిరిజన తండాలు, గ్రామాల్లో నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. 2016లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజన తండాలు, శివారు పల్లెలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి గ్రామపంచాయతీల కార్యకలాపాలన్ని అద్దె భవనాల్లో, ప్రభుత్వ పాఠశాల భవనాల్లో కొనసాగుతున్నాయి. మండలంలో కొత్తగా గొల్లకిష్టంపల్లి, బంగ్లాపల్లి గ్రామాలను కలిపి గొల్లకిష్టంపల్లి కేంద్రంగా గ్రామపంచాయతీగా ఏర్పాటు చేశారు. అలాగే చింతలతండా, లోక్యతండా, బండతండా, పాత భీమదేవరపల్లి మండలం నుంచి కన్నారం, ఎర్రబెల్లి గ్రామాలను కలుపుతూ మొత్తం 14 గ్రామాలతో వేలేరును మండలంగా ఏర్పాటు చేశారు. ఇందులో 5 గ్రామాలకు కన్నారం, గొల్లకిష్టంపల్లి గ్రామాలకు ఎన్ఆర్ఈజీఎస్ కింద చింతలతండా, లోక్యతండ, బండతండా గ్రామాలకు ఎస్టీ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఎస్టీఎస్‌డీఎఫ్) కింద ఒక్కో పంచాయతీ భవనం నిర్మాణానికి రూ.20 లక్షల చొప్పున మంజూరు చేశారు. దీంతో అప్పటి ఎమ్మెల్యేలు సతీష్‌కుమార్, తాటికొండ రాజయ్యలు పక్కా భవనాలకు శంకుస్థాపన చేయగా అప్పటి సర్పంచ్‌లే పనుల చేపట్టారు. కొంతమంది తమ అనుచరులను ముందుపెట్టి పనులు చేయించారు. కానీ సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఇప్పటికైనా పంచాయతీ భవనాల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పనులు ఏ దశలో ఉన్నాయంటే..


అసంపూర్తిగా చింతలతండా భవనం


షెడ్డులో కొనసాగుతున్న గ్రామపంచాయతీ

వెంటనే పూర్తి చేయాలి



నూతనంగా ఏర్పడిన చింతల తండ గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి ఎస్టీఎస్‌డీఎఫ్ నిధుల కింద రూ.20లక్షలు మంజూరు అయ్యాయి. సంబంధిత కాంట్రాక్టర్ బిల్లులు రావడం లేదని చాలా కాలం కిత్రమే పనులు నిలిపివేశాడు. వెంటనే పూర్తి చేసి అందుబాటులోకి తేవాలి.

– మాలోతు రాజు

త్వరలో పూర్తి చేస్తాం

ఎన్నికల నేపథ్యంలో నిర్మాణ పనులు కొంత నెమ్మదిగా జరుగుతున్నాయి. మూడు గిరిజన తండాల్లో పనులు జరుగుతున్నాయి. పనులు జరిగిన మేరకు బిల్లులు రూపొందించి పైఅధికారులకు పంపించాం. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే పనులను ప్రారంభిస్తాం. నిర్మాణ పనులను త్వరలోనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తాం.

– తిరుపతి, ట్రైబల్ వెల్ఫేర్ ఏఈ

కేవలం ఒక్క చింతలతండా గ్రామంలో 70 శాతం పనులు పూర్తయ్యాయి. గొల్లకిష్టంపల్లి, లోక్యతండా గ్రామాల్లో స్లాబ్ వరకు చేరుకున్నాయి. కన్నారంలో ఇంకా బేస్‌మెంట్ దశలోనే మూలుగుతోంది. బండ తండా గ్రామంలో పనులు ఇంకా ప్రారంభించనే లేదు. ఇప్పటికైనా పెండింగ్ బిల్లులు చెల్లిస్తే భవన నిర్మాణాలు పూర్తి చేసి అప్పగిస్తామని సదరు కాంట్రాక్టర్లు తెలుపుతున్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి, సంక్షేమం

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

దామెర : కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంతో పాటు కోగిల్వాయి, ల్యాదెల్ల, దుర్గంపేట్, తక్కళ్లపహాడ్, ఊరుగొండ, పసరగొండ, పులుకుర్తి గ్రామాల్లో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. డబుల్ బెడ్రూం, నిరుద్యోగులకు ఉద్యోగాలు, దళితులకు మూడెకరాల భూమి, దళిత బంధుతో పాటు అనేక హామీలను అమలు చేయకుండా కేసీఆర్ మోసం చేశారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో వందల కోట్ల రూపాయలు కొల్లగొట్టి రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, గృహజ్యోతి, 500 రూపాయలకే గ్యాస్ సిలెండర్ అందించిందని అన్నారు. త్వరలోనే ఆరు గ్యారంటీల అమలుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కడియం కావ్యకు ఓటువేసి భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఊరుగొండలో జరిగిన సమావేశంలో కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి పాల్గొని మాట్లాడారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. బీఆర్ఎస్, బీజేపీలకు ఓటు అడిగే నైతిక హక్కులేదని అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు మన్నెం ప్రకాశ్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి దుర్శెట్టి భిక్షపతి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ నాగేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్‌లు రవీందర్, రాజిరెడ్డి, సునితా, రమేశ్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరగా ఆయన కండువాకప్పి ఆహ్వానించారు.

బీఆర్ఎస్ గెలుపును ఆపలేరు : చల్లా


మాట్లాడుతున్న ధర్మారెడ్డి

నడికూడ : వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపును ఎవరూ ఆపలేరని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని వరికోల్, పులిగిల్ల, రాయపర్తి, నర్సక్కపల్లితో పాటు మండల కేంద్రంలో శనివారం ఆ పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని అన్నారు. బీజేపీకి ఎజెండానే లేదని, అందుకే మతపరమైన వ్యాఖ్యలు చేస్తూ రెచ్చగొట్టి గట్టెక్కాలని చూస్తోందని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీకి రాష్ట్రంలో ఒకేసారి ఎదురుదెబ్బ తగలబోతోందన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు చంద్రమౌళి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలను నివారించాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

ధర్మసాగర్ : విద్యుత్ ప్రమాదాలను వినియోగదారులు, ఉద్యోగులు నివారించాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ రూరల్ డీఈ బి.సామ్యానాయక్ అన్నారు. మండలంలోని పెద్దపెండ్యాలలో శనివారం విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సమస్యలు ఏర్పడినప్పుడు వినియోగదారులు సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. స్వంతంగా ఏలాంటి పనులు చేయొద్దని సూచించారు. అనంతరం విద్యుత్ భద్రతా వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ దానయ్య, ధర్మసాగర్, పంథిని, ఐనవోలు మండలాల ఏఈలు సుధాకర్, రమేశ్, శివకుమార్ పాల్గొన్నారు.

వేలేరులో..

వేలేరు : విద్యుత్ భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని ఏడీఈ రాజు ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని సబ్ స్టేషన్‌లో కరపత్రాలను ఆవిష్కరించారు. విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని కోరారు. అనంతరం సిబ్బందికి, వినియోగదారులకు అవగాహన కల్పించారు. అవసరమైనప్పుడు మాత్రమే విద్యుత్‌ను వినియోగించాలని సూచించారు. ఏఈ కుమారస్వామి, లైన్ ఇన్‌స్పెక్టర్లు కనుకయ్య, అమ్జద్, లైన్‌మెన్‌లు మహేందర్, సంజీవ్, సారయ్య, శ్రీనివాస్, జేఎల్‌ఎం సురేష్, రవి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఇంటింటా ప్రచారం



దామెర : వరంగల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ మండల కేంద్రంలో శనివారం బీఆర్ఎస్ నాయకుడు సోనబోయిన రాజు ప్రచారం నిర్వహించారు. శనివారం ఇంటింటా తిరుగుతూ ఓట్లను అభ్యర్థించారు. లోక్‌సభ ఎన్నికల్లో సుధీర్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కరపత్రాలు పంపిణీ చేశారు. గ్రామశాఖ ప్రధానకార్యదర్శి ప్రసాద్, నాయకులు యాదాండ్ల ఐలయ్య, జల్సా రాజు, వంగ రవి, సోనబోయిన తిరుపతి పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన అవసరం


అవగాహన కల్పిస్తున్న మనోహర్‌రావు

శాయంపేట : భూసార పరీక్షలతో కలిగే ప్రయోజనాలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ప్రజ్వల్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ఫెసిలీటర్ మోటే మనోహర్‌రావు అన్నారు. మండలంలోని కొప్పుల గ్రామంలో శనివారం భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించారు. వేసవి కాలంలో భూసార పరీక్షలు నిర్వహించేందుకు నేలలు అనుకూలమని అన్నారు. సంస్థ ప్రతినిధులు భూమి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు నిర్వహిస్తారని అన్నారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగించాలని సూచించారు. రైతులు వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కొప్పుల గ్రామ డైరెక్టర్ అడిదల శ్రీనివాస్‌రెడ్డి, గుండారపు రవీందర్, మామిడి రవి, పసుల బాబు, ఈగరి భద్రయ్య, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య


ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న అధ్యాపకులు

శాయంపేట : ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందని కళాశాల అధ్యాపకులు అన్నారు. ఈ మేరకు శనివారం మండలంలో పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇంటికెళ్లి కరపత్రాలు అందించారు. ప్రభుత్వ కాలేజీలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు పాఠాలు బోధిస్తారని అన్నారు. ప్రభుత్వ కాలేజీలో చేరాలని సూచించారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ ఇంగ్లిష్, తెలుగు మీడియం కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కళాశాలలో ఇంటర్ పూర్తయిన విద్యార్థులు నర్సింగ్, ఉన్నత చదువుల్లో ఉత్తీర్ణత సాధించడంతో తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటున్నారని తెలిపారు. విద్యార్థులకు తెలుగు అకాడమీ పుస్తకాలు ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ప్రతి సంవత్సరం స్కాలర్‌షిప్ సౌకర్యం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు హిమబిందు, సునీల్, శైలేందర్, వేణు, కల్పన, మల్లికార్జున్, రవీంద్రనాయక్, శ్రీనివాస్, సౌజన్యతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి


ఆత్మకూరు : సిబ్బందికి సూచనలు చేస్తున్న ఏసీపీ


దామెర : హోం ఓటింగ్‌ను పరిశీలిస్తున్న ఎస్సై


శాయంపేట : ఇంటివద్ద ఓటు వేస్తున్న వికలాంగుడు

ఆత్మకూరు : ఎన్నికల విధుల్లో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ కిశోర్‌కుమార్ అన్నారు. మండలంలోని కటాక్షపూర్ చెక్‌పోస్టును, కామారంలో వృద్ధుల నుంచి స్వీకరించే హోం ఓటింగ్‌ను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెక్‌పోస్టు వద్ద సిబ్బంది ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలన్నారు. సీఐ క్రాంతికుమార్ పాల్గొన్నారు.

దామెర : అర్హులైన ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఎస్సై కొంక అశోక్ సూచించారు. మండలంలోని ల్యాదెళ్ల, పులుకుర్తి గ్రామాల్లో శనివారం నిర్వహించిన హోమ్ ఓటింగ్‌ను ఎస్సై పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులు, 85 సంవత్సరాలు పైబడిన వృద్ధుల సౌకర్యార్థం ఇంటివద్దే ఓటువేసేలా ఎన్నికల కమిషన్ హోమ్ ఓటింగ్ సదుపాయం కల్పించిందని అన్నారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అర్హులు తమ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరారు. ఆయన వెంట ఆర్ఐ భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

హోం ఓటింగ్ స్వీకరణ

శాయంపేట : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వృద్ధులు, నడవలేని స్థితిలో ఉన్న వారు ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల కమిషన్ హోం ఓటింగ్‌కు శ్రీకారం చుట్టింది. శనివారం మండలంలో నడవలేని స్థితిలో ఉన్న ఓటర్ల ఇంటికెళ్లిన ఎన్నికల అధికారులు.. ఓటును స్వీకరించి బ్యాలెట్‌లో భద్రపరిచారు. కొప్పుల గ్రామంలో ముగ్గురు ఓటు వేయగా, సాధన్‌పల్లి, కాట్రపల్లి, పత్తిపాక, శాయంపేట, మైలారం గ్రామాల్లో ఒక్కో ఓటు చొప్పున నమోదు అయినట్లు ప్రిసైడింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు, ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఈ బ్యాలెట్ బాక్స్‌ను భూపాలపల్లి నియోజకవర్గంలోని స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరచనున్నట్లు అధికారులు తెలిపారు.

కమలాపూర్‌లో..


కమలాపూర్ : హోం ఓటింగ్ స్వీకరిస్తున్న అధికారులు

కమలాపూర్ : 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు 19 మందితో హోం ఓటింగ్ స్వీకరించినట్లు ప్రిసైడింగ్ అధికారి సారబుడ్ల మహేందర్‌రెడ్డి తెలిపారు. మండలానికి చెందిన 9 మంది వృద్ధులు, 11 మంది దివ్యాంగులు హోం ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. కాగా శుక్రవారం 11 మందితో, శనివారం 8 మందితో హోం ఓటింగ్ స్వీకరించామని, మరొకరు మృతి చెందినట్లు పీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ రంగు దామోదరాచారి, మైక్రో అబ్జర్వర్ కరుణాకర్‌రావు, ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ, ఏఆర్ఐ శ్రీనివాస్, కానిస్టేబుల్ సురేందర్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడికి మెళకువలు పాటించాలి


ఆయిల్‌పామ్ తోటను పరిశీలిస్తున్న మధులిక

దామెర : ఆయిల్‌పామ్ సాగులో అధిక దిగుబడి పొందేందుకు రైతులు మెళకువలు పాటించాలని పరకాల డివిజన్ ఉద్యానవన శాఖాధికారి మధులిక అన్నారు. మండలంలోని ఆయిల్‌పామ్ పంటలను శనివారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వేసవి తాపం నుంచి మొక్కలు తట్టుకునేందుకు మొక్కల పాదులకు కొద్దిదూరంలో జనుము విత్తనాలు చల్లాలని అన్నారు. నీటి ఎద్దడి ఉన్న తోటల్లో అంతర పంటల సేద్యం చేయకూడదని సూచించారు. అదే విధంగా పాదులను నిండుగా నీటితో తడపకుండా తేమ ఉండే విధంగా చూసుకోవాలని అన్నారు. మూడేళ్ల మొక్కలోని పూగుత్తులను లేత దశలోనే ప్రతీనెలా అబ్లేషన్ సాధనంతో తొలగించాలని అన్నారు. ఎదిగిన ఆయిల్‌పామ్ గెలలు కోసిన తరువాత వాటిని నరికి ముక్కలు చేసి ఆయిల్ పామ్ ఆకులను, మగపూల గుత్తులను, మొక్కజొన్న చొప్పను, ఖాళీ ఆయిల్ పామ్ గెలలను మల్చింగ్‌గా పరచాలని సూచించారు. మొక్కల ఆకులను నరకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఆమె వెంట రైతులు తదితరులు ఉన్నారు.

‘కొండపర్తి’లో కేంద్ర బలగాల కవాతు


కవాతు నిర్వహిస్తున్న పోలీస్‌లు, కేంద్ర బలగాలు

ఐనవోలు : పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా మండలంలోని కొండపర్తి గ్రామంలో శనివారం స్థానిక పోలీస్‌లు సీఆర్‌పీఎఫ్ కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా పర్వతగిరి ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఓటర్లు నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని అన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును అర్హులందరూ వినియోగించుకోవాలని సూచించారు.

‘కావ్యను గెలిపించాలి’



పరకాల : కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలంటే కాంగ్రెస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్యను గెలిపించాలని పట్టణంలోని 47వ బూత్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పావుశెట్టి సునీల్ అన్నారు. ఈ మేరకు 47వ బూత్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించి కడియం కావ్యకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కాంగ్రెస్ గ్యారంటీ కార్డులు, కరపత్రాలను పంపిణీ చేశారు. నాయకులు శ్రీనివాస్, కుమార్, చరణ్‌రాజ్, రమేష్, సందీప్, గోపి, గంగరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థికసాయం అందజేత

ధర్మసాగర్ : మండలంలోని పెద్దపెండ్యాల గ్రామానికి చెందిన సిద్ర మోహిన్, కోడెపాక రితేష్, చార్మిని పదోతరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరచగా మాజీ సర్పంచ్ తోట స్రవంతి శనివారం అభినందించారు. ఈ సదర్భంగా కొంత ఆర్థికసాయం అందించారు. శాలువాతో సన్మానించారు. శేరి రాజేశ్వర్‌రెడ్డి, సాంబయ్య, రాజ్‌కుమార్, జనార్దన్, రాజిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, లింగారెడ్డి, భిక్షపతి పాల్గొన్నారు.

పరామర్శ

శాయంపేట : మండలంలోని గోవిందాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు సావ్వళ్ల సారయ్య శనివారం మృతి మృతిచెందగా భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహానికి పూలమాల వేశారు.

క్లుప్తంగా

కలెక్టర్‌కు ఫిర్యాదు

ధర్మసాగర్ : మండలంలోని నారాయణగిరి గ్రామపంచాయతీ కార్యదర్శి రఘుపై అదే గ్రామానికి చెందిన మజ్జిగ లింగం, గంటే కృష్ణ శనివారం హనుమకొండ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలో నూతన గృహ నిర్మాణ అనుమతులకు, ఇతర పనులకు కార్యదర్శి రఘు డబ్బులు డిమాండ్ చేస్తూ వసూళ్లకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. స్థానికంగా గ్రామంలో నివాసం ఉండకుండానే హౌస్ అలవెన్స్ తీసుకుంటున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శిపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

‘రాజేందర్‌రావును గెలిపించాలి’



కమలాపూర్ : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని హుజూరాబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలసాని రమేశ్‌గౌడ్ కోరారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి శనివారం మండల కేంద్రంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని, వెలిచాలను గెలిపించి పార్లమెంట్‌లకు పంపించాలని కోరారు. నాయకులు ఆడెపు శ్రీకాంత్, కిన్నెర కృష్ణమూర్తి, పెరుమాండ్ల పర్శరాములుగౌడ్, భిక్షపతి, మహేందర్, మనోజ్, రాజేష్, సుభాష్, రమేష్, సుభాష్, సాంబయ్య, నరేష్, విజయ పాల్గొన్నారు.

ఆశీర్వదించండి

పరకాల : వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో తనను ఆశీర్వదించి గెలిపించాలని రెబల్ అభ్యర్థి మంద నరేష్ కోరారు. శనివారం ప్రచారం నిర్వహించి ఓట్లను అభ్యర్థించారు.

నేడు 5కే రన్

కేయూ క్యాంపస్: పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని ఓటరు చైతన్య కార్యక్రమంలో భాగంగా ఓట్ ఫర్ ష్యూర్ అనే స్లోగన్‌తో ఎన్నికల జిల్లా అధికారులు ఈనెల 5న ఉదయం 6గంటలకు హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం వద్ద 5కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈమేరకు యూనివర్సిటీ టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు, విద్యార్థులు రన్‌లో పాల్గొనాలని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు 5కే రన్ కొనసాగనుంది.

నేడు మెగా రక్తదాన శిబిరం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తలసేమియా వ్యాధిగ్రస్తులైన పిల్లలకు సహాయార్థంగా ఈనెల 5న ఉదయం క్యాంపస్‌లోని స్పోర్ట్స్ బిల్డింగ్, క్రీడామైదానం వద్ద మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు వాకర్స్ ఇంటర్నేషనల్ చీఫ్ కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణ, కేయూ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శంకర్ శనివారం తెలిపారు. రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

7న రాష్ట్రస్థాయి సదస్సు

న్యూశాయంపేట: భారత్ బచావ్ ఆధ్వర్యంలో ఈనెల 7న హనుమకొండ సుబేదారిలో జరగనున్న రాష్ట్రస్థాయి సదస్సును జయప్రదం చేయాలని భారత్ బచావో రాష్ట్ర ఆర్గనైజర్ డాక్టర్ రాజ్‌మహ్మద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ సుబేదారి అసుంత భవన్‌లో మంగళవారం జరగనున్న సదస్సులో రచయిత, ఎకానమిస్ట్ పరకాల ప్రభాకర్, తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, భారత్ బచావో జాతీయ నాయకుడు డాక్టర్ గోపినాథ్, ఉద్యమకారులు గాదె ఇన్నయ్య హాజరవుతారని పేర్కొన్నారు.

యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా వినోద్ లోక్‌నాయక్

కేయూ క్యాంపస్: భారతీయ యువజన కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి, తెలంగాణ ఉద్యమకారుడు వినోద్ లోక్‌నాయక్ నియమితులయ్యారు. ఈమేరకు ఢిల్లీ ఏఐసీసీ కార్యాలయం నుంచి యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి రోష్నిజైస్వాల్ ఉత్తర్వులు జారీ చేసినట్లు వినోద్ లోక్‌నాయక్ శనివారం తెలిపారు.

2కిలోల గంజాయి స్వాధీనం

ఖిలా వరంగల్: వాహన తనిఖీల్లో 2 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గరిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైలు మహిమూద్, గోవర్దన్, మున్నీరుల్లాతో కలిసి కేసు వివరాలను ఇన్‌స్పెక్టర్ శనివారం వెల్లడించారు. ఖిలా వరంగల్ పెట్రోల్ బంక్ జంక్షన్‌లో ఎస్సై మహిమూద్ వాహన తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురు వ్యక్తుల్లో వరంగల్ శివనగర్ సాయిబాబా గుడి ప్రాంతానికి చెందిన కలకోట్ల చరణ్ పట్టుపడగా.. ఆదిత్య, అనిల్ ఇద్దరు పరారయ్యారు. ఈమేరకు చరణ్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు.

రైల్వే డీఎంఈకి సన్మానం

కాజీపేట రూరల్: కాజీపేట డీజిల్ లోకోషెడ్ సీనియర్ డీఎంఈ ఎ.స్వరాజ్‌కుమార్ అవార్డు పొందగా రైల్వే రిటైర్డ్ ఎంప్లాయీస్ నాయకులు శనివారం శాలువాతో సన్మానించారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆర్. రమేష్ (S.R) : 9441557565 (ఎల్కతుర్తి)
కె. సుధాకర్ (A.C.O) : 9177258410 (హన్మకొండ)

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875
9553955722
9010299096
Office mail : wglsakshiadvt@gmail.com